
సాక్షి ఒడిశా
మంగళవారం । 23 । మే । 2023





**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలక వర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5.29.201, బంగారం 400 మిల్లీగ్రాములు, వెండి 9 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



**సభాపతి ఎవరు?**

● అనుభవం కలిగిన నేత కోసం వెతుకులాట

- 8లో



**హింజిలికాట్‌లో గాలివాన బీభత్సం**

- 8లో

## న్యూస్‌రీల్

### ఎంపీ మున్నా ఖాన్ పశు వాత్సల్యం



దూడ దాహార్తి తీర్చుతున్న ఎంపీ మున్నా ఖాన్

కొరాపుట్: అధికార పార్టీ బీజేడీకి చెందిన రాజ్యసభ ఎంపీ మని ముల్లాఖాన్(మున్నా ఖాన్) పశు వాత్సల్యం చూపారు. తన స్వగ్రామం నవరంగ్‌పూర్ జిల్లా తారాగాం నుంచి సోమవారం ఉదయం కారులో ప్రయాణిస్తున్న ఆయన.. రోడ్డు పక్కన గిరిజనులు మామిడి పళ్లు విక్రయించడంతో కొనుగోలు చేసేందుకు వాహనాన్ని ఆపారు. ఇంతలో తీవ్రమైన ఎండ ప్రభావం వల్ల అతని వద్దకు కొన్ని ఆవులు చేరాయి. వెంటనే వాహనంలోని సీసాల్లో ఉన్న నీటిని వాటికి అందించి, దాహార్తి తీర్చారు. మామిడి పండ్లు కొనుగోలు చేసి, ఆహారంగా పెట్టారు. స్వతాహాగా ఒలీవుడ్ హీరో అయిన మున్నా ఖాన్.. తరచూ ఇలా ప్రచారంలో ఉంటారు.

### తాబేళ్ల అక్రమ రవాణాకు అడ్డుకట్ట



ఉమ్మర్‌కోట్ అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న తాబేళ్లు

కొరాపుట్: అక్రమంగా తరలిస్తున్న 119 తాబేళ్లను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నవరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ ప్రాంతంలో అక్రమంగా తాబేళ్ల రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఆశాఖ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో నౌగుడ వద్ద బైక్‌పై భారీ బస్తాలతో వ్యక్తి ప్రయాణించడాన్ని గమనించి, అదుపులోకి తీసుకుని పరిశీలించారు. అందులో 119 తాబేళ్లు బయట పడ్డాయి. వీటిని రవాణా చేస్తున్న రమేష్ దాస్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ ఉభయచరాలను కలహండి జిల్లా నుంచి నవరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి కుములి గ్రామానికి తరలిస్తున్నట్లు నిందితుడు అంగీకరించాడు. పట్టుబడిన తాబేళ్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు. దాడుల్లో అటవీశాఖ అధికారి అనూప్ సింగ్, ఫారెస్టర్ హరిహర బ్రహ్మ, భగవాన బొత్రా, అశుతోష్ పాఢి తదితరులు పాల్గొన్నారు.

### అమలాభట్ట పంచాయతీ కార్యాలయానికి తాళం



సిబ్బంది లోపల ఉండగానే కార్యాలయానికి తాళం వేస్తున్న గ్రామస్తులు

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి అమలాభట్ట పంచాయతీ కార్యాలయానికి ఛతౌఅంబో గ్రామస్తులు సోమవారం తాళం వేశారు. వందలాది మంది మహిళలు కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. గ్రామంలో గత 4నెలలుగా తాగునీటి సమస్య వేధిస్తున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు వాపోయారు. దీంతో అంతా ఏకమై పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. అదే కార్యాలయంలో జరుగుతున్న పీడీఎస్ బియ్యం పంపిణీని కూడా నిలిపివేశారు. విషయం తెలుసుకున్న పంచాయతీ ఈఓ అధికారి గోవింద్ సుధ్ ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. గ్రామంలో సుమారు 300కుటుంబాలు నివసిస్తుండగా.. దీనికి సంబంధించిన తాగునీటి బోర్లు రెండూ మరమ్మతులకు గురయ్యాయని సావిత్రి టక్రీ, రామారావు టక్రీ తెలిపారు. సమస్యను పరిష్కరించి, నీటి సౌకర్యం మెరుగు పరచాలని పలుమార్లు సంబంధిత అధికారులకు తెలియజేసినా ఎవరూ పట్టించుకోలేదని వివరించారు. దీనిపై స్పందించిన ఈఓ.. వారం రోజుల్లో సమస్యను నివారించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులంతా ఆందోళన విరమించారు.

# పునరుత్తేజమే.. లక్ష్యం

- రాష్ట్ర మంత్రిమండలి పునర్ వ్యవస్థీకరణ
- ఆర్థికశాఖ మంత్రిగా విక్రమ్‌కేశరి అరూఖ్ నియామకం
- శారదాప్రసాద్‌కు కార్మిక, సుధామ్ మరాండీకి విద్యాశాఖ
- ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్ గణేషీలాల్



ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ప్రముఖులు



సభికులకు అభివాదం చేస్తున్న గవర్నర్ గణేషీలాల్, సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోమవారం తన కొలువులో కొద్దిపాటి మార్పులు చేపట్టారు. ముగ్గురు కొత్త మంత్రులకు కేబినెట్‌లో స్థానం కల్పించారు. ఖాళీ పదవుల్లో వారికి సర్దుబాటు చేయడం విశేషం. స్థానిక లోక్‌సేవా భవన్‌లో సోమవారం ఉదయం జరిగిన మంత్రిమండలి ప్రమాణ స్వీకారోత్సవంలో కొత్తగా చేరిన సభ్యులు బిక్రమ్‌కేశరి అరుఖా, శారదాప్రసాద్ నాయక్, సుదామ్ మరండిలతో గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ హాజరయ్యారు. విక్రమ్ అరూఖ్ 2008 నుంచి ప్రభుత్వ చీఫ్ విప్, స్పీకర్, గ్రామీణాభివృద్ధి, న్యాయ, అటవీ, పర్యావరణం, వాతావరణ మార్పు, శాసనసభ వ్యవహారాలు, సమాచారం-ప్రజా సంబంధాలు, సహకారం ప్రభుత్వరంగ సంస్థలు తదితర శాఖల్లో మంత్రిగా కీలకమైన బాధ్యతలు విజయవంతంగా నిర్వహించారు. నవీన్ కొలువులో మరో మాజీమంత్రి సుధామ్ మరాండీకి పాఠశాలలు, సామూహిక విద్యాశాఖను కేటాయించారు. గతవారం విద్యాశాఖ మాజీమంత్రి సమీర్‌రంజన్ దాస్ పదవికి రాజీనామా చేయడంతో ఈ మంత్రిత్వ శాఖ ఖాళీ అయ్యింది.

**నిరంజన పూజారికి ఆరోగ్యశాఖ..**

మరాండి గతంలో క్రీడలు-యువజన వ్యవహారాలు, షెడ్యూల్డ్ తెగలు-కులాల అభివృద్ధి(గిరిజన సంక్షేమం), రెవెన్యూ, విపత్తు నిర్వహణ సహాయమంత్రిగా పని చేశారు. ఈదఫా మరాండీని కేబినెట్ హోదాకు ప్రమోషన్ కల్పించారు. అదే విధంగా శ్రీకాంత సాహు గతవారం రాజీనామా చేయడంతో ఖాళీ అయిన కార్మిక శాఖను శారదాప్రసాద్ నాయక్‌కు కేటాయించారు. నాయక్ 2009 నుంచి 2012 వరకు రాష్ట్ర ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమం, గృహనిర్మాణం, నగర అభివృద్ధి, అబ్కారీ శాఖ సహాయ మంత్రిగా పని చేశారు. నవీన్ కేబినెట్‌లో సీనియర్ మంత్రి, మాజీ స్పీకర్ విక్రమ్ కేశరీ అరూఖ్‌కు ఆర్థికశాఖ కేటాయించారు. ఈ ఏడాది జనవరి 29న ఝార్సుగుడలో నవకిషోర్ దాస్ హత్యతో ఖాళీ అయిన ఆరోగ్యశాఖను ప్రస్తుత ఆర్థికమంత్రి నిరంజన్ పూజారికి ఇన్‌చార్జిగా స్థిరపరిచారు.

**స్పీకర్‌గా తప్పించి.. మంత్రిగా..**

గంజాం ముఖ్యమంత్రి సొంత జిల్లా. ఆది నుంచి బీజేడీకి కంచుకోటగా ఈ ప్రాంతం చలామణి అవుతోంది. ఈ పరపతి ఏమాత్రం సడలి పోకుండా శంఖం దళం అధ్యక్షుడిగా సీఎం నవీన్ సకాలంలో స్పందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ జిల్లా నుంచి విక్రమకేశరి అరూఖ్ బలమైన నాయకుడిగా అధ్యక్షుడి దృష్టిని ఆకట్టుకున్నారు. ఈ నేపథ్యంలో స్పీకర్ పదవి కట్టబెట్టడంతో సొంత జిల్లా, నియోజకవర్గ పురోగతి అనుబంధ కార్యకలాపాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించేందుకు సమయం అనుకూలించని పరిస్థితులు తలెత్తాయి. దీని దృష్ట్యా ఆయనకు స్పీకర్ పదవి బరువు బాధ్యతలను తొలగించి, మంత్రి పదవితో జిల్లాలో పట్టు సాధించేందుకు సువిశాల అవకాశం కల్పించడం పునర్వ్యవస్థీకరణ వ్యూహంగా స్పష్టం అవుతోంది. 2019 సార్వత్రిక ఎన్నికలో గంజాం జిల్లాలోని 13 స్థానాల్లో 12 స్థానాలను కైవసం చేసుకుంది. ఈ పట్టును రానున్న ఎన్నికల్లో ఏమాత్రం చేజార్చుకోకుండా జాగ్రత్త వహించడంలో విక్రమ అరూఖ్ తగిన అభ్యర్థిగా భావించి కొలువులో చోటు కల్పించారు. ఆయన రాజకీయ శైలితో జిల్లాలో బీజేడీ కంచుకోట పట్టు యథాతథంగా కొనసాగుతుందని భావిస్తున్నారు.

**బలోపేతమే లక్ష్యంగా..**

సుందరగడ్, మయూర్‌భంజ్ జిల్లాల్లో బిజూ జనతాదళ్ గత ఎన్నికల్లో నిరాశజనకమైన ఫలితాలతో సరిపెట్టుకుంది. మయూర్‌భంజ్ లోని 9 స్థానాల్లో బీజేడీ కేవలం 3 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. సుందరగడ్ 7 స్థానాల్లో నామమాత్రంగా 2 స్థానాలకే పరిమితమైంది. ఈ రెండూ గిరిజన ప్రభావిత జిల్లాలు. అయితే 2019 సార్వత్రిక ఎన్నికల అనంతరం బీజేడీ నిరవధిక కృషికి ఫలితంగా 2022లో జరిగిన జిల్లా పరిషత్, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశాజనకమైన ఫలితాలు సాధించింది. ఈ ప్రేరణతో రానున్న ఎన్నికల్లో బలం పుంజుకునేందుకు ఇద్దరు అనుభవజ్ఞులకు మంత్రి పదవులతో పట్టం గట్టింది. ఈ జిల్లాల నుంచి మంత్రి పదవులు పొందిన సుధాం మరాండి, శారదాప్రసాద్ నాయక్‌కు రానున్న ఎన్నికలు కత్తిమీద సాములాంటి సవాల్‌గా మారాయి. ఈ సందర్భంలో పార్టీ బలం పటిష్ఠ పరచడం ఇరువురి లక్ష్యంగా కార్యాచరణ కొనసాగించాల్సి ఉంటుంది.







రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న విక్రమకేశరి అరూఖ్, సుధాం మరండి, శారదాప్రసాద్ నాయక్

### నవీన్ చతురత..



ముఖ్యమంత్రితో నూతన మంత్రులు

భువనేశ్వర్: మంత్రిమండలి పునర్వ్యవస్థీకరణలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రానున్న ఎన్నికల్లో బిజూ జనతాదళ్‌ను బలోపేతం చేయడం సంకల్పంగా స్పష్టం అవుతోంది. పార్టీ బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో బలం పుంజుకునేలా చేయడంతో గట్టి ప్రభావం ఉన్న ప్రాంతంలో పట్టు సడలిపోకుండా అత్యంత జాగరూకత ప్రదర్శించారు. ఈ నేపథ్యంలో పునర్వ్యవస్థీకరణ పురస్కరించుకుని గంజాం, సుందర్‌గడ్, మయూర్‌భంజ్ జిల్లాలకు ప్రాతినిధ్యం పునరుద్ధరించారు. ఈ ప్రాంతాల నుంచి మాజీ మంత్రులకు పదవులు కట్టబెట్టారు. గంజాం నుంచి విక్రమకేశరి అరూఖ్, మయూర్‌భంజ్ నుంచి సుధాం మరాండి, సుందరగడ్ నుంచి శారదాప్రసాద్ నాయక్‌కు మంత్రి పదవులు వరించాయి. గంజాం జిల్లాలో బీజేడీ కోటను మరింత బలోపేతం చేసేందుకు, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ సరైన రీతిలో రాణించని సుందర్‌గడ్, మయూర్‌భంజ్ జిల్లాలలో బీజేడీ బలాన్ని పెంచడానికి అనుభవజ్ఞులను ఎంపిక చేసి, మంత్రులుగా బాధ్యతలు అప్పగించారు. ఈ పదవులతో సొంత జిల్లాల్లో పురోగతి దిశలో కృషి చేసేందుకు మార్గం సుగమం అవుతుందనే దృక్పథంతో కేబినెట్ విస్తరణ పురస్కరించుకుని నవీన్ పట్నాయక్ ఆచితూచి మార్పుచేర్పులు చేపట్టడం విశేషం.

## ఆదివాసీ సమాజ భవనం ప్రారంభం



భవన ప్రారంభోత్సవంలో మంత్రి సరక, అనసూయ మాఝి

రాయగడ: రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖామంత్రి జగన్నాథ సరక జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌లో ఆదివారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఆదివాసీ సమాజం కోసం నిర్మించిన భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ చైర్‌పర్సన్ అనసూయ మాఝి, ఉపాధ్యక్షుడు వనమాలి కద్రక, సమితి అధ్యక్షుడు ఎంబ్రిత కద్రక, ఉపాధ్యక్షుడు డొంబురు నాయక్, ఆదివాసీ నాయకులు బినాయక్ కులిసిక, అప్పారావు కులిసిక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆదివాసీల అభ్యున్నతికి రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి సంస్థను ప్రత్యేకంగా ప్రారంభించిందన్నారు. ఈ సంస్థ ద్వారా ఆదివాసీల భాష, సంస్కృతి, కళలను పరిరక్షించడంతో పాటు ఆయా రంగాల్లోని వారిని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇందులో భాగంగా కల్యాణ సింగుపూర్‌లో సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఆదివాసీ సమాజ భవనానికి నిధులు మంజూరు చేసిందని వివరించారు. ఈ భవనంలో ఆయా ప్రాంతాల్లోని ఆదివాసీలు వారి వివాహాది శుభ కార్యక్రమాలను నిర్వహించేందుకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

## వేడి తారులో జారిపడి డ్రైవర్ మృతి



హాట్‌మిక్సర్ ప్లాంట్ నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

● మృతుడిది ఆంధ్రప్రదేశ్‌ లోని విశాఖపట్నం



ప్రమాదానికి కారణమైన హాట్ మిక్సర్ ప్లాంట్

రాయగడ: వేడి తారులో ప్రమాదావశాత్తు కాలు జారి పడిన ఘటనలో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. మృతుడు విశాఖపట్నానికి చెందిన ఎ.కృష్ణారావు(42)గా గుర్తించారు. జిల్లాలోని బిసంకటక్ సమితి దుర్గి పంచాయతీ పరిధి బొంధుగుడ గ్రామంలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొంధుగుడ గ్రామంలో రహదారి నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో విశాఖపట్నం నుంచి వచ్చిన లారీలోని తారును హాట్‌మిక్సర్ ప్లాంట్‌లో వేసేందుకు డ్రైవర్ కృష్ణారావు వాహనం పైకి ఎక్కాడు. వాల్‌ను తిప్పుతున్న సమయంలో కాలు జారడంతో హాట్ మిక్సర్‌ప్లాంట్(తారును వేడి చేసే యంత్రం)లో ప్రమాదావశాత్తు పడిపోయాడు. దీంతో అక్కడిక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల వారు రక్షించేందుకు ప్రయత్నించినా.. ప్రయోజనం లేకపోయింది. వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించగా, బిసంకటక్‌కు చెందిన సిబ్బంది దాదాపు 2గంటలు శ్రమించి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం సామాజిక ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, మృతుడి బంధువులకు సమాచారం అందించారు.

### మల్కన్‌గిరిలో మహిళా కోర్టు



మహిళా న్యాయస్థానాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ మురళీధర్

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో మహిళా న్యాయస్థానం ఏర్పాటైంది. ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.మురళీధర్ దీనిని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఘటనల్లో బాధితులకు సరైన న్యాయం చేకూర్చాలని సూచించారు. కుటుంబ వ్యవహారాలు, భార్యాభర్తల మధ్య వివాదాలు ఈ కోర్టులో విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా నూతన మహిళ కోర్టుకు న్యాయమూర్తిగా జిల్లా అదనపు న్యాయమూర్తి బబితా దాస్‌ను నియమించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి అజంత సొడంగి, ఇతర న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రభుత్వ స్థలం గుర్తింపునకు చర్యలు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రాయగడ: స్థానిక మజ్జిగౌరి మందిరం ప్రాంగణంలోని సుమారు 6.3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రైల్వేస్థలాన్ని మందిర అభివృద్ధి నిమిత్తం ట్రస్ట్ బోర్డుకు ఇచ్చేందుకు ఆశాఖ అంగీకరించిన విషయం తెలిసిందే. దీనికి బదులుగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని రైల్వేకు తిరిగి ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా రైల్వే అధికారులు ప్రభుత్వ స్థలం గుర్తింపు ప్రక్రియకు సోమవారం శ్రీకారం చుట్టారు. రాయగడ ఏడీఈఎన్ సంజీవ్ దీక్షిత్, ఐఓడబ్ల్యూ మనోజ్‌కుమార్ మజ్జిగౌరి మందిరం సమీపంలోని కియోజోల తదితర ప్రాంతాలను సందర్శించారు. అక్కడి ప్రభుత్వ స్థలాన్ని మ్యాప్ ఆధారంగా గుర్తించారు. సర్వేలో రాయగడ తహసీల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ టి.శ్యాంసుందర్, మందిరం జేఈ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## మహేంద్రగడలో మిషన్‌శక్తి కేఫ్ ప్రారంభం




కేఫ్ వద్ద మిషన్‌శక్తి మహిళలు



కేఫ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ స్వాతి, ఏడీఎం బీరేంద్రకుమార్

పర్లాకిమిడి: జిల్లాలోని రాయిఘడ్ బ్లాక్ కొయిపూర్ పంచాయతీ మహేంద్రగడ వద్ద మహిళా స్వయం సహాయం సంఘం ఆధ్వర్యంలో మిశన్‌శక్తి కేఫ్‌ను నూతనంగా ఏర్పాటు చేశారు. దీనిని జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) బీరేంద్రకుమార్ దాస్, జిల్లా పరిషత్ ముఖ్య అభివృద్ధి అధికారి రమాంచల్ ఖమారి సోమవారం ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా మహేంద్రగిరి పర్యాటనకు వెళ్లే వారికి రుచికరమైన, నాణ్యమైన ఆహారం తక్కువ ధరకే అందించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మిషన్‌శక్తి అధికారి రశ్మిరంజన్ శెఠి, జిల్లా పారిశ్రామిక శాఖ అధికారి సునారాం సింగ్, రాయఘడ బీడీఓ సుధీర్‌కుమార్ సింగ్, తహసీల్దార్ లీలావతి ఆచార్య, సీడీపీఓ, మిషన్‌శక్తి మహిళలు పాల్గొన్నారు.

## నిజాయితీగా దర్యాప్తు చేపట్టాలి



సమీక్షలో పాల్గొన్న ఏఎస్పీలు, డీఎస్పీలు, ఎస్‌డీపీఓలు, ఐఐసీ అధికారి

● క్రైమ్ సమీక్షలో బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ సరవణ్ వివేక్

బరంపురం: సమాజానికి, ప్రజలకు పోలీసు అధికారులు జవాబుదారీగా పనిచేస్తూ.. నిజాయితీగా కేసుల దర్యాప్తు చేపట్టడంతో పాటు సకాలంలో న్యాయస్థానానికి అప్పగించాలని బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్ సూచించారు. స్థానిక జిల్లా పోలీసు సూపరిటెండెంట్ కార్యాలయ సమావేశ మందిరంలో క్రైమ్ సమీక్ష సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పరిధిలోని పోలీసు స్టేషన్లలో నమోదైన వివిధ కేసుల నుంచి తప్పించుకొని తిరుగుతున్న నేరస్తులపై.. వెంటనే అరెస్ట్ వారెంట్ జారీ చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో తలదాచుకుంటున్న నిందితుల సమాచారం సేకరించి, జిల్లాకు తరలించాలన్నారు. ప్రధానంగా ఠాణాల్లో నమోదవుతున్న కేసులపై సరైన దర్యాప్తు చేపట్టి, చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీలు, డీఎస్పీలు, ఎస్‌డీపీఓలు, ఠాణా ఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఫంక్షన్ హాలులో అగ్నిప్రమాదం



మంటలు వ్యాపించడంతో కాలిపోయిన ఏసీ, ఫ్యాన్

రాయగడ: పట్టణంలోని హాతీపథర్ రోడ్డులో ఉన్న వంశీకృష్ణ ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. భవనం మూడో అంతస్తులో విద్యుత్ సార్ట్ సర్క్యూట్ కావడంతో అందులోని ఏసీ నుంచి మంటలు చెలరేగాయి. గమనించిన సిబ్బంది.. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి, మంటలను అదుపు చేశారు. అదే సమయంలో వివాహ కార్యక్రమం కూడా జరుగుతుండగా, అంతా సురక్షితంగా బయట పడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఫంక్షన్ హాల్లు, సినిమా థియేటర్లు, ఆస్పత్రులు, బహుళ అంతస్తుల భవనాలు, పాఠశాలల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు, సంబంధిత ధ్రువపత్రం ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. అయితే దీనికి అనుగుణంగా రాయగడలో అధికారులు తనిఖీలు చేపట్టక పోవడంతో తరచూ ప్రయాదాలు చోటు చేసుకుంటున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి.

### 102కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో పోలీసుల అదుపులో నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి పోలీసులు సింగవరం గ్రామంలో 102కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం రాత్రి ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అతి వేగంగా వస్తున్న బైక్ లను అడ్డుకొని, తనిఖీ చేశారు. 2బస్తాల్లో గంజాయి బయట పడటంతో వాటిని రవాణా చేస్తున్న ముగురిని అరెస్ట్ చేశారు. నిందితులు ఎంవీ-59 గ్రామానికి చెందిన విశ్వజిత్ తరఫ్దార్, ఎంవీ-69కు చెందిన విక్రమ్ ఓఝు, భీమ పడియామిగా గుర్తించామని కలిమెల ఐఐసీ సూర్యప్రకాష్ నాయక్ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.10 లక్షలు ఉంటుందన్నారు. నిందితులను సోమవారం ఉదయం కోర్టులో హాజరు పరిచారు.

### గిరిశిఖర గర్భిణుల వసతి గృహం సందర్శన



గర్భిణులకు మిఠాయిలు పంచిపెడుతున్న బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

సాలూరు: పట్టణంలోని వైటీసీలో గల గిరిశిఖర గర్భిణుల వసతిగృహాన్ని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు సోమవారి సందర్శించారు. ఈ మేరకు సోమవారం వైటీసీకి వచ్చిన ఆయన వసతిగృహంలో గర్భిణులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న పౌష్టికాహారం, వైద్యారోగ్య సేవలు తదితర అంశాలపై ఆరాతీశారు. ఏమైనా సమస్యలున్నాయా అని అడిగితెలుసుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో డీసీపీఓ సత్యనారాయణ, సీడ్ డైరెక్టర్ వేణుగోపాలరావు, సీడీపీఓలు పాల్గొన్నారు.

### సచివాలయ ఉద్యోగుల సంఘానికి నూతన కార్యవర్గం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎనుకున్నారు. కార్యవర్గం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్రావు, కార్యదర్శి సింహాచలం, ఆర్గనైజింగ్ కార్యదర్శి భరత్ భూషణ్‌ల ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. ఈ మేరకు నూతన కార్యవర్గం జిల్లా అధ్యక్షుడిగా కొండగొర్రి చిరంజీవులు, జిల్లా ఉపాధ్యక్షుడిగా కె.మనోజ్, ప్రధాన కార్యదర్శిగా ఆరిక రంగారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి. శివకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చంద్రరావు, జాయింట్ సెక్రటరీగా ఎ. రమేష్, ట్రెజరర్‌గా ఎస్.బాబూరావు, మెంబర్లుగా తోటయ్య, ఎస్ రాంబాబు, బి.జగదీష్. ఎ.కుమార్ ఎన్నికయ్యారు.

### రామనారాయణంలో ఉచిత ఆర్చరీ శిక్షణ

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామనారాయణంలో ఉచిత ఆర్చరీ శిక్షణ తరగతులను ధనుర్విద్య జిల్లా శిక్షకుడు గాంధీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ మాట్లాడుతూ ఏటా రామనారాయణం ప్రాంగణంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తామని, అందులో భాగంగా వేసవి శిక్షణ తరగతులను ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# కుమ్ములుసింగిలో సంయుక్త గ్రీవెన్స్

- వినతులు ఆలకించి, పరిష్కరించిన అధికారులు



అర్హులకు భూపట్టాలు అందిస్తున్న అదనపు కలెక్టర్ బీరేంద్రకుమార్

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ మారుమూల గ్రామం కుమ్ములుసింగిలో కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ ప్రభుత్వ శాఖలు సంయుక్త గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) బీరేంద్రకుమార్ దాస్, జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణాధికారి రమాంచల్ ఖమారీ, సబ్ డివిజనల్ పోలీసు అధికారి రామకృష్ణ పతి తదితరులు హాజరయ్యారు. ఇందులో అధికారులకు 61 వినతులు అందగా, 26 వ్యక్తిగతం, 35 గ్రామ సమస్యలుగా గుర్తించారు. వీటిలో 21 అభియోగాలకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ఇందులో మధుబాబు పింఛన్లు 7, భూమి పట్టాలు 13మందికి మంజూరు చేశారు. నిస్సాయులైన ఒకరికి రెడ్‌క్రాస్ నిధుల నుంచి ప్రభుత్వ సాయం అందించారు. గ్రీవెన్స్‌సెల్‌కు కుమ్ములుసింగి, మర్లబ, సన్నతుండి తదితర గిరిజన గ్రామాల ప్రజలు చేరకుని అభియోగాలు అందజేశారు. రాయఘడ బ్లాక్ అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్, బీడీఓ సుధీర్‌కుమార్ సింగ్, తహసీల్దార్ లీలావతి ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

**బిసంకటక్‌లో..**

రాయగడ: జిల్లాలోని బిసంకటక్‌లో వినతుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. సమితి కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సోమనాథ్ ప్రధాన్ హాజరయ్యారు. సమితి పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 14సమస్యలు ఆయన దృష్టికి రాగా.. ఇందులో 8 వ్యక్తిగతమైనవి, మరో 6 గ్రామ సమస్యలుగా గుర్తించారు. ఈ సందర్భంగా ప్రధాన్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ, ఏడీఎం పబ్లిక్ హెల్త్ డాక్టర్ బీఎల్ఎన్ పృష్టి, ఐటీడీఏ అధికారి శాంతిప్రభ ప్రధాన్, బిసంకటక్ బీడీఓ సదాశివ నాయక్ పాల్గొన్నారు.

**ప్రత్యేక రథం ప్రారంభం..**

జయపురం: జిల్లా న్యాయసేవా ప్రాధికరణ(జయపురం) ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి 29వరకు దివ్యాంగుల ప్రత్యేక న్యాయ సచేతన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొరాపుట్ జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవా ప్రాధికరణ అధ్యక్షుడు సత్యనారాయణ మిశ్రా దీనిని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్లు ప్రధాన భూమిక నిర్వహిస్తారని తెలిపారు. గ్రామాల్లో తిరుగుతూ దివ్యాంగులను గుర్తించడంతో పాటు వారిని చైతన్యవంతం చేసేందుకు కృషి చేస్తారన్నారు. దీనికి సంబంధించిన చైతన్య రథాన్ని న్యాయమూర్తి జెండా ఊపి, ప్రారంభించారు. కార్యక్రమంలో చీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేట్ దిలీప్‌కుమార్ సాహు, జిల్లా న్యాయసేవా ప్రాధికరణ కార్యదర్శి సుమన్ జెనా, సివిల్ కోర్టు రిజిస్ట్రార్ బిష్ణుప్రసాద్ బెవర్తా, ఎస్పీ అభినవ శంకర్, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ రాజేంద్ర మాఝి, కొరాపుట్ జిల్లా ప్రధాన అధికారి డాక్టర్ అరుణకుమార్ పాఢీ, డీఎస్ఎస్ఓ సింహాచల మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.



జయపురం: ప్రత్యేక సచేతన రథాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి మిశ్రా



రాయగడ: వినతులు ఆలకిస్తున్న ఏడీఎం ప్రధాన్, అధికారులు

# సభాపతి ఎవరు




- అనుభవం కలిగిన నేత కోసం వెతుకులాట
- మహిళలకు అవకాశంపై జోరుగా చర్చ

భువనేశ్వర్: రాష్ట్ర మంత్రిమండలి పునర్ వ్యవస్థీకరణలో మంత్రి పదవుల పట్ల ఊహాగానాలకు తెరపడింది. ప్రస్తుతం శాసనసభ తదుపరి స్పీకర్ ఎవరనే అంశం తెరపైకి వచ్చింది. ఈ పదవి కోసం పలువురు సీనియర్లు రేసులో ఉన్నట్లు సమాచారం. వీరిలో ప్రఫుల్ల సామల్, దేవీప్రసాద్ మిశ్రా, అమర్ ప్రసాద్ శత్పతి, బద్రి నారాయణ్ పాత్రో స్పీకర్ ముందున్నారు. మహిళా అభ్యర్థి స్నేహాంగిని చురియా పేరు కూడా ప్రచారంలో ఉంది. బిజూ జనతాదళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ప్రతి చోటా మహిళలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా ఆమెకు అదృష్టం కలిసి రావచ్చని సర్వత్రా చర్చ సాగుతోంది. 2019 సార్వత్రిక ఎన్నికలో అస్కా లోక్‌సభ ఎన్నికలో మహిళా కార్డు బీజేడీకి దిగ్విజయం కల్పించింది. ఈ నియోజకవర్గం మహిళా స్వయం సహాయక బృందం అధినేత ప్రమీలా బిసోయ్‌తో చేసిన ప్రయోగం పార్టీకి విశేష గుర్తింపు సాధించింది. అయితే ధామ్‌నగర్ ఉప ఎన్నికలో ఈ ప్రయోగం బెడిసి కొట్టింది. మహిళా సాధికారత మంత్రం నిరంతరం ఫలప్రదం కావడం కష్టతరమని ఈ ఎన్నిక రుజువు చేసింది. ఎప్పటికప్పుడు సరికొత్త వ్యూహంతో ఆచితూచి అడుగు వేయకుంటే రానున్న ఎన్నికల్లో పార్టీ బలం పుంజుకోవడం బలహీన పడుతుందని బీజేడీ శిబిరంలో జోరుగా చర్చ సాగుతోంది.

**నవీన్ నిర్ణయంపైనే..**

మంత్రిమండలి పునర్ వ్యవస్థీకరణ నేపథ్యంలో స్పీకర్ విక్రమ్‌కేశరి ఆరూఖ్‌తో రాజీనామా చేయించారు. ఈ స్థానం భర్తీ తదుపరి ఎన్నికలకు లాభసాటిగా ఉండేలా అభ్యర్థి ఎంపిక పట్ల బీజేడీ అధిష్టానం పదునైన ప్రక్రియతో కసరత్తు చేస్తోంది. స్పీకర్ ఆశావహుల్లో ప్రఫుల్ల సామల్, దేవీప్రసాద్ మిశ్రా, అమర్‌ప్రసాద్ శత్పతి తగిన అనుభవం అలాగే శాసన విధానాలపై పూర్తి అవగాహన కలిగిన ప్రతినిధులుగా పేరొందారు. వీరిలో ఒకరికి ప్రతిష్టాత్మక సభాపతి పదవిని కట్టబెట్టే యోచన శిబిరంలో గింగుర్లు కొడుతోంది. అయితే మహిళా మంత్రంతో ఈ నిర్ణయం ఊగిసలాడుతోంది. అయితే ప్రయోగాలు చేయడానికి సమయం కాదని, అసెంబ్లీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు సమర్థత కలిగిన అభ్యర్థిని మాత్రమే స్పీకర్‌గా నియమించాలని సీఎం నవీన్ పట్నాయక్ భావిస్తున్నట్లు సమాచారం.

# గ్రామదేవతకు ఇత్తడి ఘటాల వితరణ



కింతలి వంశస్తులు అందించిన ఇత్తడి ఘటాలు, పాలజంగిడి

రాయగడ: స్థానిక పట్టణ గ్రామదేవత బురదల పోలమ్మ అమ్మవారి ఉత్సవాలు ఈనెల 29నుంచి జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కింతలి వంశస్తులు 8 ఇత్తడి ఘటాలు, పాలజంగిడి, ఇతర పూజా సంబంధిత వస్తువులను అమ్మవారికి వితరణ చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బార్ణి జగన్‌మోహన్ నాయుడుకు వీటిని సోమవారం అందజేశారు. ఉత్సవాల్లో ఏటా మజ్జిగౌరి మందిరం నుంచి ఇత్తడి ఘటాలను తీసుకువచ్చి, పండుగ అనంతరం తిరిగి అప్పగించేవారు. ఇకపై అమ్మవారి సన్నిధిలోనే ఈ ఘటాలు ఉంటాయి. ఉత్సవాల సమయంలో వీటిని వినియోగిస్తారు.

# హింజిలికాట్‌లో గాలివాన బీభత్సం



హింజిలికాట్‌లో దాకాణంపై కూలిన భారీ చెట్టు



సెరగడాలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

- పిడుగులు పడి, ఐదుగురికి గాయాలు
- 3 ఆవులు, 10 గొర్రెలు మృతి

బరంపురం: సీఎం నవీన్ పట్నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లా హింజిలికాట్ నియోజకవర్గంలో కాలవైశాఖీ బీభత్సం సృష్టించింది. దీని ఫలితంగా సారు, సెరగడా, పిత్తలా తదితర గ్రామాల్లో ఉరుములతో పిడుగు పాటుకు ఐదుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. వీరిని ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స అందిస్తున్నారు. సెరగడాలో గాలివాన కారణంగా మేతకు వెళ్లిన మందలో 3 ఆవులు, 10 గొర్రెలు మృతి చెందాయి. అలాగే ఎక్కడిక్కడే విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. భారీ హోర్డింగ్‌లు సైతం ఎగిరిపడ్డాయి. ఉదయమంతా ఎండ వేడి, ఉక్కపోత కారణంగా ఉక్కిరిబిక్కిరి అయిన జనం.. భారీ వర్షం కారణంగా వాతావరణం చల్లబడి కొంత ఉపశమనం పొందారు.

**పిడుగుపడి యువకుడు..**

జయపురం: సబ్ డివిజన్ పరిధి కుంద్రా సమితిలోని చరక గ్రామంలో ఆదివారం రాత్రి పిడుగుపడి యువకుడు దుర్మరణం చెందాడు. మృతుడు అదే గ్రామానికి చెందిన మికాయిల్ మండి(24)గా గుర్తించారు. ఆరబెట్టి ఉన్న బట్టలు తీసేందుకు యువకుడు ఇంటి మేడపైకి వెళ్లగా, అకస్మాతుగా పిడుగుపడి అక్కడికక్కడే కుప్పకూలాడు. పిడుగు శబ్దంతో మేడపైకి వెళ్లి చూసిన కుటుంబ సభ్యులు.. విగతజీవిగా పడి ఉన్న మికాయిల్‌ను కుంద్రా కమ్యూనిటీ వైద్య కేంద్రానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. విషయం తెలుసుకున్న రమగిరి పోలీసులు ఆస్పత్రికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మాజీమంత్రి, కొట్‌పాడ్ ఎమ్మెల్యే పద్మినీ దియాన్, స్వతంత్ర అభివృద్ధి పరిషత్ చైర్మన్ చంద్రోఖర మాఝి, కొరాపుట్ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు రాధా బినోద్ సామంతరాయ్, కుంద్రా సర్పంచ్ లొబొ పొరజ, సమితి సభ్యులు దామోదర గోండ్, కుంద్రా యువజన బీజేడీ అధ్యక్షుడు విక్రమకుమార్ బెహరా తదితరులను బాధిత కుటుంబాన్ని కలిసి, ఓదార్చారు.



మికాయిల్ మండి మృతదేహం



పిడుగు పాటుకు మృతిచెందిన ఆవులు

# ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్

- ఒక్కొక్కరిపై రూ.8 లక్షల రివార్డు



విలేకర్లతో మాట్లాడుతున్న సీఆర్‌పీఎఫ్ అధికారి సిన్హా, వెనుక పట్టుబడిన మావోయిస్టులు

బరంపురం: కొందమాల్-ఛత్తీస్‌ఘడ్ సరిహద్దు కెసరబడి దట్టమైన అటవీ ప్రాంతంలో కూబింగ్ నిర్వహిస్తున్న ఎస్ఓజీ జవాన్లపై దాడికి తెగబడేందుకు వ్యూహం పన్నుతున్న మావోయిస్టులను సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్ జవాన్లు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి కొందమాల్ జిల్లా ఫుల్బణి ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో సీఆర్‌పీఎఫ్ అధికారి సిన్హా మాట్లాడారు. ఆదివారం అర్ధరాత్రి మావోయిస్టులు జవాన్లపై దాడికి సిద్ధమయ్యారనే సమాచారంతో సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్ జవాన్లు సంయక్తంగా దాడి చేశారని తెలిపారు. ఆ సమయంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఇద్దరు మావోయిస్టులు పట్టుబడగా, అరెస్ట్ చేశామని వెల్లడించారు. వీరిలో సైలిక్, పూనమ్ కరుడుగట్టిన మావోయిస్టులుగా గుర్తించామన్నారు. వారిలో ఒక్కొక్కరిపై రూ.8 లక్షల రివార్డు ఉన్నట్లు ప్రకటించారు. ఇద్దరికీ సహకరించిన మరో వ్యక్తిని కూడా అరెస్ట్ చేశామని వివరించారు. మరోవైపు సరిహద్దు ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్-బీఎస్ఎఫ్ దళాల కూబింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది.

### హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవం

విజయనగరం లీగల్/కొత్తవలస: భార్యను శారీరకంగా, మానసికంగా వేధించి హతమార్చాడన్న ఆరోపణ రుజువు కావడంతో కొత్తవలస మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఇనుపచప్ప చింతాలుకు జీవిత ఖైదుతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ మూడవ జిల్లా అదనపు జడ్జి మీనాదేవి సోమవారం తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించి అదనపు పబ్లిక్‌ప్రాసిక్యూటర్ మరువాడ రవీంద్రనాథ్ అందించిన వివరాలిలా ఉన్నాయి. నిందితుడు చింతాల్.. భార్య దుర్గమ్మను ప్రతి చిన్న విషయానికి అనుమానించసాగాడు. ఈ విషయంలో వారు తరచూ తగువులు పడుతుండే వారు. ఆమెపై కక్ష పెంచుకుని మానసికంగా, శారీరకంగా వేధించసాగాడు. సుమారు రెండేళ్ల క్రితం చింతాల్ భార్యను హతమార్చాడు. ఈ మేరకు కొత్తవలస సీఐ బాలసూర్యారావు కేసు నమోదు చేసి నిందితుడు చింతాల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రాసిక్యూషన్ సరైన ఆధారాలతో కేసు రుజువు చేయడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

### వేధింపులపై కేసు నమోదు

పాచిపెంట: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్త, ఆడపడుచులపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు పాచిపెంట ఎస్సై వెంకటరమణ సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలం దత్తిరాజేరు గ్రామానికి చెందిన బగ్గ గౌరీ శంకరరావుతో పాచిపెంట మండలం పాంచాలి గ్రామానికి చెందిన గౌరికి 2019లో వివాహమైంది. వారికి గత ఏడాది పాప పుట్టి మరణించింది. అప్పటినుంచి గౌరీశంకరరావు రోజు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు, అంతే కాకుండా గౌరిని భర్తతో పాటు అత్త రాములమ్మ, ఆడపడుచు పైడిరాజు అదనపు కట్నం రూ.రెండు లక్షలు కావాలని వేధింపులకు గురిచేసే వారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకాలు

- జాతీయ పోటీలకు ఇద్దరు జిల్లా క్రీడాకారుల ఎంపిక



బాక్సింగ్ పోటీల్లో సాధించిన పతకాలతో జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు పంచ్ పవర్ చూపించారు. విశాఖపట్నం వేదికగా జరిగిన యూత్ మెన్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో 13 విభాగాల్లో పోటీ పడిన జిల్లా బాక్సర్‌లు 8 విభాగాల్లో పతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో 80-86 కేజీల విభాగంలో తలపడిన పి.దేవ కుమార్ , 86-92 కేజీల విభాగంలో ఆడిన బి.చంద్రశేఖర్‌లు బంగారుపతకాలు సాధించగా..46-48 కేజీల విభాగంలో ఎస్.తేజశ్వర్, 70-78 కేజీల విభాగంలో ఎస్.మోహనరావులు వెండి పతకాలు కైవసం చేసుకున్నారు. అలాగే 51-54 కేజీల విభాగంలో సీహెచ్ చంద్రశేఖర్, 54-56 కేజీల విభాగంలో జె.వసంత్, 57-60 కేజీల విభాగంలో కె.రవితేజ, 66-70 కేజీల విభాగంలో బి.మనోజ్‌లు కాంస్య పతకాలు దక్కించుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు దక్కించుకున్న పి.దేవ కుమార్, బి.చంద్రశేఖర్‌లు త్వరలో సిక్కిం రాష్ట్రంలో జరగనున్న మెన్స్ యూత్ బాక్సింగ్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున ఎంపికైనట్లు ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డోలా మన్మథకుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో పాటు జాతీయ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను సోమవారం ఆయన అభినందించారు. కార్యక్రమంలో శాప్ బాక్సింగ్ కోచ్ బి. ఈశ్వరరావు, సభ్యులు ఎస్ఈ రాజు, డి.మురళి, బి.జగదీష్, వి.సంతోష్‌కుమార్, పి.శ్రీనివాసరావు, బి.ప్రసాద్‌లు ఉన్నారు.

# గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



పార్వతీపురం టౌన్: అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి వారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు వారి సమస్యలపై స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. పోలీసు అధికారులు వారి పరిధిలో గల సమస్యలను పరిష్కరించి వాటికి సంబంధించిన నివేదికలను అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, దిశ డీఎస్పీ ఎస్ఆర్ హరిత, ఏఆర్‌డీఎస్పీ బి.నాగేశ్వరరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ ప్రభాకర్, ఎస్సై పి.దినకర్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

**స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు**

విజయనగరం క్రైమ్: స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపట్టాలని విజయనగరం జిల్లా ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆమె స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సామాన్య ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో 37 ఫిర్యాదులను స్వీకరించిన ఆమె వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్పీ సీఐలు జి.రాంబాబు, ఇ.నరసింహమూర్తి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరో ముగ్గురికి గాయాలు



మృతుడు గణేష్

బొబ్బిలి: విధి వక్రించడమంటే ఇదే. రోడ్డుప్రమాదంతో ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తుండగా సంఘటనా స్థలంలోనే మరో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని ఎంతో భవిష్యత్తున్న యువకుడు మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అలజంగికి చెందిన ఓ ట్రాక్టర్ పిక్కరాయితో వెళ్తుండగా గ్రోత్ సెంటర్, పట్టణం మధ్యలోని పోలవాని వలస వద్ద టైర్ పంక్చరయింది. దీంతో డ్రైవర్ తొట్టెను రోడ్డు పక్కగా ఉంచి, పంక్చర్ వేయించి తీసుకెళ్లొచ్చని ఇంజిన్‌ను తీసుకుని వెళ్లిపోయాడు. ఈ తొట్టెను గమనించని పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం చిలకల పల్లికి చెందిన టాటా ఏస్ వాహనం ఢీకొంది. ఈ వాహనంలో ప్రయాణిస్తున్న చిలకపల్లికి చెందిన బోనెల సాంబయ్య కాలు విరిగిపోయింది. అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనాస్థలంలో టాటా ఏస్, ట్రాక్టర్ తొట్టె ఉండిపోవడంతో ట్రాఫిక్ క్లియర్ చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఓ క్రేన్‌ను తీసుకువచ్చి వాహనాలను రోడ్డుపక్కకు లాగే ప్రయత్నంలో ఉండగా పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు బైక్‌పై స్పీడ్‌గా వచ్చి తొట్టె, టాటా ఏస్‌ల మధ్య బలంగా ఢీకొన్నారు. క్షతగాత్రులను పోలీసులు తమ వాహనాల్లోనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో టాటా ఏస్ నడుపుతున్న పట్టణంలోని నాయుడు కాలనీకి చెందిన కోట్ల గణేష్(23) అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మరో ఇద్దరిలో ఇందిరమ్మ కాలనీకి చెందిన బూర్లి చిన్నారావు తీవ్ర గాయాలపాలవగా విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. టి.సురేష్ స్వల్ప గాయాలతో బయటపడగా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా మృతి చెందిన యువకుడు గణేష్ తండ్రి కోట్ల శ్రీనివాసరావు విశాఖ ప్రభుత్వ ఐటీఐలో ఇన్‌స్ట్రక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా ఈ దుర్ఘటన జరగడంతో కుటుంబసభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.



సంఘటనా స్థలం వద్ద బైక్, ట్రాక్టర్ తొట్టె

## క్లుప్తంగా

### బైక్, కారు ఢీ: ఇద్దరికి గాయాలు



గంట్యాడ: కొర్లాం వద్ద ప్రమాద దృశ్యం

గంట్యాడ: పూసపాటి రేగ మండలానికి చెందిన నూకరాజు, రాజు ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో అరకు నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా కొర్లాం జంక్షన్‌లో గంట్యాడ నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు విజయనగరంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

**లారీ ఢీకొని ఇద్దరికి..**



పార్వతీపురం: చికిత్స పొందుతున్న రుత్విక్

**పార్వతీపురం:** పార్వతీపురం మండలం వెంకంపేట పంచాయతీ వసుంధర నగర్‌కు చెందిన బగ్గాం వెంకటరమణ, మనుమడు రుత్విక్ పార్వతీపురంలోని రిలయన్స్ షాపు నుంచి ద్విచక్రవాహనంపై వారి ఇంటికి వస్తుండగా గెడ్డవీధి సమీపంలో వెనుక నుంచి లారీ ఢీ కొంది. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే కింద పడి గాయాలపాలయ్యారు. ఈ మేరకు చికిత్సకోసం వారిని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

**ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి..**

**పాచిపెంట:** మండల కేంద్రానికి చెందిన మద్ది రవీంద్ర ద్విచక్ర వాహనంపై సాలూరు వెళ్తుండగా సాలూరు నుంచి వస్తున్న ట్రాక్టర్ కర్రివలస సమీపంలో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రవీంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 సహాయంతో సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటరమణ పేర్కొన్నారు.

### కేతు విశ్వనాథరెడ్డి మృతికి సంతాపం

**శ్రీకాకుళం కల్చరల్:** అరసం పూర్వ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, కథా రచయిత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మృతి పట్ల శ్రీకాకుళ సాహితీ సభ్యులు సోమవారం సంతాపం ప్రకటించారు. ఒంగోలులో గుండెపోటుతో మరణించిన ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. వానకురిస్తే, తేడా, అమ్మవారి నవ్వు, కూలిన బురుజు, నమ్ముకున్న నేల వంటి వంద కథలు, బోధి, వేర్లు వంటి నవలికలు రచించారని కొనియాడారు. సంతాపం తెలియజేసిన వారిలో రచయితలు అట్టాడ అప్పలనాయుడు, దాసరి రామచంద్రరావు, చింతాడ తిరుమలరావు, కళమట దాసుబాబు తదితరులు ఉన్నారు.

### దివ్యాంగులకు స్కూటీల పంపిణీ

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** జిల్లాలోని 20 మంది ఆర్థోపెడిక్ దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటీలు(ట్రై స్కూటర్ల)ను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పంపిణీ చేశారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగి ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రూ.లక్షా ఇరవై వేల విలువైన వాహనాన్ని లబ్ధిదారుకు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీ నవీన్, దివ్యాంగుల శాఖ సిబ్బంది కవిత, వర్మ, రామారావు తదితరులు పాల్గొన్నారు

### కుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలు

**రణస్థలం:** జీరుకొవ్వాడలో కుక్కలు స్వైర విహారం చేశాయి. గ్రామానికి చెందిన కోరెడ్ల అవినాష్, రామచరణ్, శ్రావణిలు ఇంటి ముందు ఆడుతుండగా ఒక్కసారిగా కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. చిన్నారుల కేకలు విని తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో కుక్కలు పారిపోయాయి. చిన్నారులను సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు.

### పీజీటీ మిగులు పోస్టుల భర్తీకి సన్నాహాలు

**శ్రీకాకుళం న్యూకాలనీ:** శ్రీకాకుళం జిల్లాలో ఆరు హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఇంటర్మీడియెట్ కోర్సుల బోధనకు ఐదు మిగులు పీజీటీ పోస్టులను భర్తీ చేసేందుకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల నుంచి జిల్లా విద్యాశాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. జిల్లాలో ఆరు జిల్లా పరిషత్ యాజమాన్యంలోని హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో 42 పీజీటీల పోస్టుల భర్తీకి ఈ నెల 20న కౌన్సెలింగ్ నిర్వహించగా 37 మంది అభ్యర్థులు వారు కోరుకున్న స్థానాల్లో నియమితులయ్యారు. మరో ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జెడ్పీహెచ్ స్కూల్ వజ్రపుకొత్తూరులో ఫిజిక్స్, బోటనీ, జువాలజీ పీజీటీలు, జెడ్పీహెచ్ స్కూల్ బ్రాహ్మణతర్లాలో ఫిజిక్స్ పీజీటీ, జెడ్పీహెచ్ స్కూల్ హరిపురంలో జువాలజీ పీజీటీ పోస్టు భర్తీ కావాల్సి ఉన్నాయి. అర్హత గల స్కూల్ అసిస్టెంట్లు ఈ నెల 24లోగా దరఖాస్తుతో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్‌తో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి హాజరుకావాలని డీఈఓ ఎస్.తిరుమల చైతన్య కోరారు.

---

సాగర సంగమం సంపూర్ణమవ్వాలంటే బాలుకు ఓ రఘుపతి కావాలి. సీతాకోక చిలుక అందంగా ఎగరాలంటే ఆ కథకు డేవిడ్ ఉండి తీరాలి. అన్వేషణ అంతం కావాలంటే అడుగడుగునా జేమ్స్ కనిపించాలి. ఆపద్బాంధవుడిలా చిరంజీవి మారాలంటే శ్రీపతి లాంటి ఉత్తముడు రావాలి. అప్పలనరసయ్య సంసారాన్ని చదరంగంలా ఆడాలంటే ప్రకాష్ అనే పొగరుబోతు కొడుకు ఇంటిలో తిరగాలి. పనివాడు ముత్తు గొప్పవాడిగా మారాలంటే నిజం తెలుసుకునే జమీందార్ అతని కళ్ల ముందుండాలి. ఇన్ని గొప్ప కథలకు, ఇలాంటి కథకులకు వరంలా దొరికిన నటుడు శరత్‌బాబు. ఆమదాలవలసలో పుట్టి పెరిగిన ఈ అందగాడు తెలుగు, తమిళ సినిమాల్లో మర్చిపోలేని పాత్రలకు ప్రాణప్రతిష్ట చేశారు. వెండితెరపై అందంగా వికసించిన ఆయన నవ్వు ఇప్పుడు మాయమైపోయింది. అర్ధ శతాబ్దం పాటు అప్రతిహతంగా సాగిన నట ప్రస్థానం నేటికి కళామతల్లి పాదాల చెంతకు చేరుకుంది. వంశధార నుంచి మెరీనా తీరం వరకు ఆయన సాగించిన ప్రయాణం సిక్కోలు స్మరించుకుంటోంది.

# ముగిసిన శరత్‌కాలం





- సీనియర్ నటుడు శరత్‌బాబు కన్నుమూత
- శోకసంద్రంలో ఆమదాలవలస

| | |
|---|---|
| జన్మదినం: | 1951 జూలై 31 |
| స్వస్థలం: | ఆమదాలవలస |
| అసలు పేరు : | సత్యనారాయణ దీక్షితులు |
| మొదటి సినిమా : | రామరాజ్యం(1973) |
| చివరి సినిమా : | మళ్లీ పెళ్లి ( ఈ నెల 26న విడుదల కానుంది) |



శరత్‌బాబును సత్కరిస్తున్న స్నేహాంజలి సభ్యులు

స్నేహాంజలి ఆర్ట్స్ అకాడమీ, శ్రీకాకుళంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న శరత్‌బాబును ఘనంగా సత్కరించారు.

–శ్రీకాకుళం కల్చరల్

**ఆమదాలవలస:** వంశధార నదీ తీరాన సత్యనారాయణ దీక్షితులుగా ఆడిపాడిన శరత్‌బాబు వేలాది మంది సినిమా అభిమానులను శోకంలో ముంచుతూ శాశ్వత సెలవు తీసుకున్నారు. ఆమదాలవలసకు చెందిన ఆయన రెండు నెలల నుంచి అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ముందు చెన్నైలోనే ట్రీట్‌మెంట్ తీసుకున్నారు. అక్కడి నుంచి బెంగళూరు, మళ్లీ అక్కడి నుంచి హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చేర్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మల్టీ ఆర్గాన్స్ డ్యామేజ్, కిడ్నీ ఫెయిల్యూర్, లంగ్స్ ఇష్యూతో ఆయన ఇబ్బంది పడుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు.

**ఆమదాలవలసలోనే..**

శరత్‌బాబు బాల్యం, యవ్వనం ఆమదాలవలసలోనే గడిచింది. ఆయన తండ్రి విజయ్‌శంకర్ దీక్షితులు ఉత్తరప్రదేశ్‌లో పెళ్లి చేసుకుని ఆమదాలవలస వచ్చి స్థిరపడ్డారు. శరత్‌బాబు ఇక్కడే పుట్టారు. ఆయన అసలు పేరు సత్యనారాయణ దీక్షితులు. 13 మంది సంతానంలో శరత్‌బాబు ఒకరు. వీరికి ఆమదాలవలసలో రైల్వేస్టేషన్ ఎదురుగా గౌరీ శంకర్ విలాస్ అనే బ్రాహ్మణ భోజన హొటల్ ఉండేది.

- శరత్‌బాబు ఆమదాలవలసలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్‌మీడియెట్ చదివారు. డిగ్రీ శ్రీకాకుళంలో ఆర్ట్స్ కళాశాలలో చదివారు.
- తిత్లీ తుఫాన్ సమయంలో రెండు లక్షల రూపాయలు జిల్లాకు ఆర్థిక సాయం చేశారు. అలాగే ఆమదాలవలసలో ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం, అయ్యప్ప స్వామి దేవాలయం, సంగమేశ్వర దేవాలయాలకు ఒక్కో లక్ష చొప్పున విరాళాలు అందించారని కుటుంబ సభ్యులు తెలిపారు.

నరసన్నపేటకు సినీ నటులు శరత్‌బాబు 1980 లో వచ్చారు. ఈ సందర్భంగా తన చిన్ననాటి స్నేహితుడు, క్లాస్‌మేట్ అప్పటి తహసీల్దార్ ప్రస్తుత విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పీరు ఎర్రయ్య ఇంటికి వెళ్లారు. ఎర్రయ్యతో చాలా సేపు ముచ్చటించారు.



**ఎన్నో పాత్రలు..**

ఆమదాలవలస పట్టణానికి చెందిన శరత్‌బాబుకు చిన్ననాటి నుంచి నటనపై ఆసక్తి ఉండేది. కుటుంబ సభ్యులకు విషయం చెప్పి చెన్నై వెళ్లారు. చిత్రపరిశ్రమ మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు తరలివచ్చినా ఆయన చెన్నైలోనే సెటిల్ అయ్యారు. ఆయన 1973 రామరాజ్యం సినిమా ద్వారా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. సినీ ప్రయాణంలో 250కిపైగా సినిమాల్లో నటించారు. చివరిగా వకీల్‌సాబ్ సినిమాలో కనిపించారు. బుల్లితెరపైనా ప్రేక్షకులను మెప్పించారు. తెలుగు, తమిళ టీవీ సీరియళ్లలో నటించారు.

### సంగమయ్య ఆలయానికి విరాళం



సంగమేశ్వర కొండ వద్ద ఉన్న సంగమేశ్వర ఆలయం

**ఆమదాలవలస రూరల్:** ఆమదాలవలస మండలంలోని సంగమేశ్వర కొండకు శరత్‌బాబు తన సొంత ఖర్చుతో ఐదేళ్ల కిందట టైల్స్ వేయించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా రాష్ట్రంలో మొట్టమొదటిగా నిర్వహించే జాతర సంగమేశ్వర జాతర. జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందినవారు జనం వచ్చి సంగమయ్య కొండను, గుహలో ఉన్న సంగమయ్యను దర్శించుకుంటారు. అలాంటి సమయాల్లో గుహ లోపలకు వెళ్లేందుకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు శరత్‌బాబు దృష్టికి తీసుకురావడంతో వెంటనే గుహ లోపల టైల్స్ వేయించాలని తన సోదరులకు తెలపడంతో వాటిని అమర్చారు.

### దిగ్భ్రాంతికి గురయ్యా: స్పీకర్



**ఆమదాలవలస:** ఆమదాలవలసకు మంచి పేరు తెచ్చిన నటుడు శరత్‌బాబు మృతి చెందడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం ఓ ప్రకటనలో తెలిపారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమదాలవలస నియోజకవర్గంలో, ఆమదాలవలస పట్టణానికి చెందిన సత్యనారాయణ దీక్షితులు అలియాస్ శరత్ బాబు మృతి చెందిన సమాచారం తనకు తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో బీఎస్సీ చదువుకున్న రోజుల్లోనే నటనపై శరత్ బాబుకు మక్కువ ఉండేదన్నారు. అప్పట్లో ఆర్ట్స్ కళాశాల వార్షికోత్సవంలో 'వాపస్' నాటకంలో నిరుద్యోగ యువకుడిగా శరత్ బాబు వేసిన పాత్ర రక్తి కట్టించిందన్నారు. 44 ఏళ్ల తన రాజకీయ ప్రస్థానంలో ఆమదాలవలస పేరు ప్రఖ్యాతలు బాహ్య ప్రపంచానికి పరిచయం చేసిన వారిలో శరత్ బాబు ఒకరిని కొనియాడారు. శరత్ బాబు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### ఆమదాలవలసకు తీరని లోటు

**ఆమదాలవలస:** శరత్‌బాబు మృతి అటు సినీ పరిశ్రమకు, ఇటు ఆమదాలవలసకు తీరని లోటని ఆమదాలవలసకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సిటిజన్ ఫోరం అధ్యక్షుడు, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ జేజే మోహన్‌రావు అన్నారు. శరత్‌బాబుతో తమ కుటుంబానికి స్నేహ సంబంధాలు ఎక్కువగా ఉండేవని జ్ఞాపకం చేసుకున్నారు. చివరిసారిగా ఆమదాలవలసలో అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠ సమయంలో ఆయన వచ్చారని చెప్పారు. ఆమదాలవలస పట్టణంలోని గల ప్రధాన రహదారి సింగపూర్ రహదారిలా తీర్చిదిద్దుదామని శరత్‌బాబు అన్నారని తెలిపారు. శరత్‌బాబుకు ఆమదాలవలస లో ఎర్నాగుల ప్రభాకరరావు, పీరు యర్రయ్య, రవిబ్రహ్మం అనే స్నేహితులు ఉన్నారని, ప్రస్తుతం వారంతా ఉద్యోగరీత్యా వేరే చోట్ల నివసిస్తున్నారని తెలిపారు.



శరత్‌బాబుతో సాహిత్య అకాడమీ రాష్ట్ర డైరెక్టర్, సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జేజే మోహనరావు

**కలిసేవాళ్లం**



ఆర్ట్స్ కాలేజీలో చదువుకున్న శరత్ బాబు కళాశాలలో నాటక ప్రదర్శనలు ఇచ్చేవా రు. అప్పట్లో ఇక్కడి లలిత శ్రీ కళా సమితి వారు స్థానిక ఎంహెచ్‌స్కూల్ తిలక్ హాలులో వేసే రిహార్స్ చూసేందుకు వచ్చేవారు. మేమెప్పుడైనా మద్రాస్ వెళ్తే ఆయనను కలిసేవాళ్లం. **– ఎల్.రామలింగస్వామి, రంగస్థల కళాకారుల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు**

### సంతాపం

**ఆమదాలవలస:** శరత్‌బాబు మృతి సినీ పరిశ్రమకు తీరని లోటని పట్టణానికి చెందిన అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు కేవీ రాజారావు, కార్యదర్శి మందపల్లి రామకృష్ణ అన్నారు. ఆయన మృతికి ఆమదాలవలస కు చెందిన గురుస్వామి యర్నాగుల, మాజీ కౌన్సిలర్ జేకే వెంకటేశ్వరరావు తదితరులు సంతాపం తెలిపారు.

### కలిసి చదువుకున్నాం

శరత్ బాబు మృతి చెందారని తెలియగానే సొంత కుటుంబ సభ్యుడిని కోల్పోయాననే బాధ కలిగింది. నేను, శరత్ బాబు ఏడో తరగతి నుంచి కలిసి చదువుకున్నాం. శ్రీకాకుళం డిగ్రీ ఆర్ట్స్ కళాశాలలో ఆయన ఎంపీసీ, నేను సీబీజెడ్‌లో చేరాం. మంచి తెలివైన విద్యార్థి. క్రమశిక్షణకు మారుపేరు. శరత్ బాబు ఒరిజనల్ పేరు సత్యనారాయణ దీక్షితులు. ఆయన ముప్పై ఏళ్లు వరుసగా అయ్యప్ప మాల వేశారు. 2019 వరకూ ఎప్పటికప్పుడు మాట్లాడుకునేవాళ్లం. తర్వాత తగ్గింది. 1980 లో నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో టంకాల బాబ్జీ తదితరులు శరత్‌బాబును సత్కరించారు. ఆ జ్ఞాపకాలన్నీ గుర్తుకు వస్తున్నాయి.

**– పీరు ఎర్రయ్య, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్**



ఒక సన్మాన సభలో శరత్ బాబుతో ఎర్రయ్య

**రూమ్‌లో ఉన్నాం..**



శరత్‌బాబు మద్రాసులో మాతో పాటు రూమ్‌లో ఉండేవారు. నేను సినీ గాయకుడు ఆనంద్ కలసి ఆ రోజుల్లో సుకుమార్ ఆర్కెస్ట్రా నడిపేవాళ్లం. ఆ డబ్బులతో రోజువారి ఖర్చులు జరిగేవి. మాకు అక్కడ బాగోలేకపోవడంతో వచ్చేశాం. కానీ ఆయన మాత్రం ఉండిపోయారు.

**– బందారు చిట్టిబాబు, సినీ సంగీత దర్శకుడు**

**శరత్‌బాబు ద్వారానే వెళ్లాను**



ఆమదాలవలసకు చెందిన నేను ఎలక్ట్రీషియన్‌గా పనిచేసేవాడిని. శరత్ బాబు ద్వారానే ఇండస్ట్రీకి వెళ్లాను. 35 ఏళ్లగా ఆ రంగంలోనే ఉన్నాను. నాకు శరత్‌బాబు చాలా సహాయం చేశారు. ప్రస్తుతం నేను తమిళనాడులో నివసిస్తున్నాను. ఆయన మృతి తీరని లోటు.

**– కృష్ణారావు, ఎలక్ట్రీషియన్, సినీ పరిశ్రమ**

---

# సంక్షేమ సమాచారమిదే..

- సంక్షేమ క్యాలెండర్ 2023-24 ఆవిష్కరణ




సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్ తదితరులు

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను నిర్ణయించిన తేదీ ప్రకారం అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ రూపొందించిన 'జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ 2023-24' లను సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జేసీ ఎం.నవీన్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఏ నెలలో ఏ సంక్షేమ పథకం అందజేయనున్నారో అన్ని వివరాలను షెడ్యూల్ చేశారని వివరించారు. ఈ క్యాలెండర్‌ను మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పంపిణీ చేయాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ మాత్రమే సంక్షేమ పథకాల క్యాలెండర్ ముందుగానే ప్రకటిస్తున్నారని తెలిపారు. క్యాలెండర్ ఆవిష్కరణలో డీపీఆర్‌ఓ కె.బాలమాన్ సింగ్, జెడ్పీ సీఈఓ వెంకట్రామన్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి బి.మీనాక్షి, డీఎస్‌ఓ వెంకటరమణ, డీపీఓ రవికుమార్ పాల్గొన్నారు.

**పథకాల వివరాలివే..**

- **మే 2023:** వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ (మొదటి విడత), వైఎస్సార్ ఉచిత పంటల బీమా, జగనన్న విద్యాదీవెన (మొదటి విడత), వైఎస్సార్ కల్యాణమస్తు–షాదీ తోఫా (మొదటి త్రైమాసికం), వైఎస్సార్ మత్స్యకార భరోసా
- **జూన్:** జగనన్న విద్యా కానుక, జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ లా నేస్తం (మొదటి విడత), మిగిలిపోయిన లబ్ధిదారులకు లబ్ధి.
- **జూలై :** జగనన్న విదేశీ విద్యా దీవెన (మొదటి విడత), వైఎస్సార్ నేతన్న నేస్తం, ఎంఎస్‌ఎంఈ ప్రోత్సాహకాలు, జగనన్న తోడు (మొదటి విడత), వైఎస్సార్ సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీ), వైఎస్సార్ కల్యాణమస్తు–షాదీతోఫా (రెండో త్రైమాసికం).
- **ఆగస్టు :** జగనన్న విద్యా దీవెన (రెండో విడత), వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ వాహనమిత్ర.
- **సెప్టెంబర్ :** వైఎస్సార్ చేయూత
- **అక్టోబర్ :** వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ (రెండో విడత), జగనన్న వసతి దీవెన (మొదటి విడత)
- **నవంబర్:** వైఎస్సార్ సున్నావడ్డీ – పంట రుణాలు, వైఎస్సార్ కల్యాణమస్తు– షాదీతోఫా (మూడవ త్రైమాసికం), జగనన్న విద్యాదీవెన (మూడో విడత).
- **డిసెంబర్:** జగనన్న విదేశీ విద్యాదీవెన (రెండో విడత), జగనన్న చేదోడు, మిగిలిన వారికి లబ్ధి.
- **జనవరి:** వైఎస్సార్ రైతుభరోసా – పీఎం కిసాన్ (మూడో విడత), వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు (రెండవ విడత), వైఎస్సార్ లా నేస్తం (రెండవ విడత), పెన్షన్ల పెంపు (నెలకు రూ. 3000).
- **ఫిబ్రవరి 2024:** జగనన్న విద్యా దీవెన (నాల్గో విడత), వైఎస్సార్ కల్యాణమస్తు షాదీ తోఫా (నాల్గో త్రైమాసికం), వైఎస్సార్ ఈబీసీ నేస్తం
- **మార్చి:** జగనన్న వసతి దీవెన (రెండో విడత), ఎంఎస్‌ఎంఈ ప్రోత్సాహకాలు.

### పాతపట్నం.. కొత్త ఉత్సాహం





సుందరంగా విద్యుత్ దీపాలంకరణ (ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకరణలో నీలమణిదుర్గ అమ్మవారు

నీలమణి దుర్గ అమ్మవారి ఉత్సవాలతో పాతపట్నంకు కొత్త ఉత్సాహం వచ్చింది. ఈ నెల 24వ తేదీన దేవర జంగిడితో అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానిస్తున్న నేపథ్యంలో కాపువీధిలో ఉన్న ఆలయంలో పూజలు నిర్వహించారు. పండుగ సందర్భంగా లక్షలాది రూపాయల వ్యయంతో పాతపట్నం ప్రధాన రహదారిలో అమ్మవారి ఆలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు అందరినీ ఆకర్షిస్తున్నాయి.

–పాతపట్నం

### 30 నుంచి ముఖలింగేశ్వరుని కల్యాణోత్సవం

**జలుమూరు:** ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలోని మధుకేశ్వరుని కల్యాణోత్సవం ఈ నెల 30 నుంచి జూన్ నెల 4 వరకూ నిర్వహించనున్నట్లు ఈఓ పి.ప్రభాకరరావు తెలిపారు. 30న గణపతి పూజతో ప్రారంభించి ధ్వజారోహణ, బలిహరణ, 31న జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి స్వామి తిరువీధి ఉత్సవం, పుట్టమన్ను తేవడం, శతమానం, మట్టెలు తీసుకొని రావడం, రాత్రి తొమ్మిది గంటలకు స్వామి కల్యాణం రాయబారం, పది గంటలకు కల్యాణం ఔపాసన అనంతరం రాత్రి పార్వతీ పరమేశ్వరులకు నంది వాహనంపై తిరువీధి ఉత్సవం, మే ఒకటిన స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. అలాగే 2న సదస్యం, పండిత సభ, చతుర్వేద పారాయణం, మహా మంత్రపుష్పం, హారతి, 3న దొంగ వెళ్లి మైనాకోత్సవం, రాత్రి ఏడు గంటలకు మైనాకుని ఉత్సవం 4న నాగవల్లి, స్వామివారి వసంతోత్సవం, అనంతరం పవి త్ర వంశధార నదిలో పవిత్ర స్నానాలు ఉంటాయని పేర్కొన్నారు.



శ్రీముఖలింగేశ్వర స్వామివారు

### '25లోగా ఫీజు చెల్లించాలి'

**శ్రీకాకుళం న్యూకాలనీ:** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్ సొసైటీ) ద్వారా టెన్త్, ఇంటర్మీడియెట్ చదువుతూ.. ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ ఫీజులను ఈనెల 25వ తేదీలోగా చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. టెన్త్ విద్యార్థులు సబ్జెక్టుకు రూ. 100 చొప్పున, ఇంటర్ పరీక్షలకు సబ్జెక్టుకు రూ.150 చెప్పున ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా ఈనెల 25వ తేదీలోపు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.25 ఆలస్య రుసుంతో ఈనెల 26 నుంచి 29 వరకు, రూ.100 ఆలస్య రుసుంతో ఈనెల 30, 31 తేదీల్లో చెల్లించేందుకు వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. తత్కాల్ ఫీజుతో జూన్ 2వ తేదీలోగా చెల్లించాలని, గతంలో ప్రవేశం పొంది పరీక్ష ఫీజు చెల్లించనివారు, పరీక్షలలో ఉత్తీర్ణులు కాని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ సూచించారు. పరీక్ష ఫీజులను మీసేవ, ఏపీఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని ఆయన వివరించారు.